సాక్షి
విజయనగరం
గురువారం । 7 । మార్చి । 2024



చదువుల లోగిళ్లు... గిరిజన సంక్షేమ ఆశ్రమాలు - 8లో

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన సంక్షేమ విద్యకు పెద్దపీట వేస్తోంది. బై జూస్ కంటెంట్‌తో చదువులు సాగుతున్నాయి.



ఒకే ఈతలో రెండు దూడలు

తెర్లాం: తెర్లాం మండలంలోని సింగిరెడ్డివలసలో మడక రామారావుకు చెందిన ఆవు ఒకే ఈతలో బుధవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు ఒకే రంగులో, ఒకే విధంగా ఆరోగ్యంగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నేడు మంత్రి బొత్స రాక

విజయనగరం అర్బన్: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గరివిడి మండలం దువ్వాంలో గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభించి అక్కడ జరిగే సభలో పాల్గొంటారు. 4.50 గంటలకు దేవాడలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రారంభిస్తారు.

న్యూస్‌రీల్

పంట సీజన్ ముగిసేలోగా పరిహారం

- జిల్లాలో 1,059 మంది రైతులకు రూ.50.62 లక్షల పెట్టుబడి రాయితీ



ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ తదితరులు

విజయనగరం అర్బన్: గతేడాది డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.కార్తీక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, రైతులు కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో 2023 మిచాంగ్ తుఫాన్‌కు 297.77 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరిగింది. పరిహారంగా ఇన్‌పుట్ సబ్సిడీ కింద జిల్లాలోని 1,059 మంది రైతులకు రూ.50.62 లక్షల పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి బటన్‌నొక్కి జమచేశారు. 2019–20 నుంచి 2023–24 వరకు ఐదేళ్లలో 15,349 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.543.49లను ప్రభుత్వం చెల్లించినట్టు కలెక్టర్ వెల్లడించారు.

సీపీఓ కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్

- ప్రారంభించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ప్రాంగణంలోని ముఖ్య ప్రణాళిక విభాగంలో ఫెసిలిటేషన్ సెంటర్, కాన్ఫరెన్స్ హాల్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ఆధునీకరించినట్టు సీపీఓ పి.బాలాజీ తెలిపారు. అభివృద్ధి పనుల నివేదికలపై క్షేత్రస్థాయిలో, ఉన్నతాధికారులతో సమీక్షించుకునేందుకు హాల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఐసీ డైరెక్టర్ నరేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, ప్రణాళికా విభాగం అధికారి వరహాలరావు పాల్గొన్నారు.

11న అప్రెంటీస్ మేళా

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న ఉదయం 9 గంటలకు అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్రెంటీస్ మేళాలో రెడ్డీ ల్యాబ్స్, టెర్రీ అల్లాయిస్, మైలాన్, వరణ్ మోటార్స్, జయభేరీ, జిందాల్ స్టీల్, డెక్కన్ ఫెర్రో అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్, శారద స్టీల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఐటీఐ, ఇంటర్మీడియట్ (ఒకేషనల్) ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థులు వారి బయోడేటా, ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్, రెండు పాస్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్: 98491 18075, 98499 44654 నంబర్లను సంప్రదించాలన్నారు.

రామభద్రపురం పీహెచ్‌సీకి అదనపు హంగులు



పీహెచ్‌సీ ఆవరణలో ఆస్పత్రి అదనపుగదుల నిర్మాణానికి భూమి పూజచేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, వైద్యసిబ్బంది

రామభద్రపురం: మండల వాసులకు శుభవార్త. స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల్లో భాగంగా అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది. పనుల పర్యవేక్షణ బాధ్యతను రోడ్లు భవనాల శాఖ అధికారులకు అప్పగించింది. భవన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం భూమిపూజ చేశారు. అయితే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో సభ్యులైన ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును భూమిపూజకు ఆహ్వానించకపోవడంపై అధికారుల తీరును మండల వాసులు తప్పుబడుతున్నారు. ఎమ్మెల్యే సోదరుడు వేణుగోపాలనాయుడుకి సమాచారం ఇచ్చామని, ఆయన ఎమ్మెల్యేకు చెబుతానని చెప్పారని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ వస్తే పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉండడంతో భూమిపూజ చేశామన్నారు.

కలహాల రాజు

ఆయన పేరులో 'రాజు' ఉన్నా.. తీరు మాత్రం నీచం. నమ్మిన వారికే వెన్నుపోటు పొడుస్తారు. ప్రజల మధ్య చిచ్చుపెడతారు. నిత్యం కుటిల రాజకీయాలు నెరపుతూ వివాదాలకు కేంద్ర బిందువవుతారు. ఆ ప్రాంత అభివృద్ధికి అవరోధం కలిగిస్తారు. అనునిత్యం అహంకారధోరణి ప్రదర్శించే ఆయనను ఏ పల్లె నమ్మదు. చివరకు ఏ పార్టీ కూడా శాశ్వతంగా ఇముడ్చుకోదు. ఆయన రాజకీయ ప్రస్థానం ఆది నుంచీ అంతే అంటూ కొన్ని ఘటనలను ఎస్.కోట వాసులు ప్రస్తావించుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

- ఆది నుంచీ ఎమ్మెల్సీ రఘురాజు ఆధిపత్య ధోరణి
- శృంగవరపుకోట నియోజకవర్గంలో విచిత్ర రాజకీయం
- సొంత పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలపై తిరుగుబాటు
- 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవ్వరితోనూ కుదరని సయోధ్య
- పార్టీ విధానం కన్నా సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం
- రఘురాజు వైఖరిపై విమర్శల వెల్లువ



సాక్షి ప్రతినిధి, విజయనగరం: శృంగవరపుకోట జెడ్పీటీసీ సభ్యుడిగా 2001–06 కాలంలో ఇందుకూరి రఘురాజు రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అదే సమయంలో బొత్స ఝాన్సీలక్ష్మి విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. సొంత సోదరుడిలా రఘురాజును ఆదరించారు. జిల్లాలో రాజకీయ దురంధరుడైన బొత్స సత్యనారాయణ కూడా అండదండలు అందించారు. ఇదే అదనుగా బొత్స శిష్యుడినంటూ రఘురాజు ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గంలో చక్రం తిప్పారు. స్థాయికి మించి ఎమ్మెల్సీ పదవి పొందేవరకూ వెన్నుదన్నుగా నిలిచిన బొత్స కుటుంబానికే ఇప్పుడు రఘురాజు వెన్నుపోటు పొడిచాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొత్స ఝాన్సీలక్ష్మి ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గం భాగంగా ఉన్న విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న సమయంలో తన భార్య సుబ్బలక్ష్మిని, అనుచర గణాన్ని టీడీపీలోకి పంపించేసిన వైనం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఈ తరహా తిరుగుబాటు ధోరణి కొత్తేమీ కాదని, గత రెండు దశాబ్దాలుగా ఎస్.కోట నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఎవరున్నా వారికి సున్నం పెట్టడం అతనికి వెన్నతో పెట్టిన విద్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● సొంత డప్పు..

తాను ఏ పార్టీలో ఉన్నా తనది పార్టీ లైన్ (విధానం) కాదని, తనదంతా సొంత స్టైల్ అని ఇందుకూరి రఘురాజు ఎంతో గర్వంగా తరచూ వల్లిస్తుంటారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో ఎవ్వరు ఎమ్మెల్యేగా ఉన్నా, ఎవ్వరు అక్కడ అభ్యర్థులుగా ఉన్నా వారిని తన గుప్పెట్లో ఉంచుకోవాలనే ఆరాటం నిలువెల్లా కనిపిస్తూ ఉంటుంది. తన మాటల గారడీకి లొంగకపోతే ఇక బెదిరింపుల పర్వం మొదలవుతుంది. ఇదే విధానంతో తన స్వగ్రామం బొడ్డవరతో పాటు పెద్దఖండేపల్లి, కిల్తంపాలెం, ముషిడిపాలెం గ్రామస్తులనూ శాసిస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. ప్రతిచోట రెండు వర్గాలుగా విడగొట్టి, అందులో ఒకరికి కొమ్ముకాస్తూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంటారనేది జగమెరిగిన సత్యం. రఘురాజు ఆధిపత్య ధోరణి, వెన్నుపోటు, దుష్ప్రచారంతో ఇబ్బందిపడిన పార్టీ నాయకులు ఎందరో ఉన్నారు.

● శెట్టి గంగాధరస్వామి:

గతంలో ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఎస్.కోట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 1994, 1999 సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేశారు. అంతకు ముందు అనంతగిరి మండలంలో గిరిజనుల నాయకుడిగా, ఎంపీపీగా పనిచేశారు. ఈ రెండు దఫాలు ఓడిపోయినా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చురుగ్గా ఉండేవారు. 2001 సంవత్సరంలో ఎస్.కోట జెడ్పీటీసీగా రాజకీయాల్లోకి వచ్చిన రఘురాజుకు కొద్దిరోజుల్లోనే శెట్టి గంగాధర స్వామి ఎందుకో నచ్చలేదు. అడుగడుగునా ఆయన్ను ఇబ్బందిపెడుతూనే ఉండేవారు. ఇదెంతవరకూ వెళ్లిందంటే 2004 సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి పోటీచేయడానికి సిద్ధమైన గంగాధర స్వామికి ఆఖరి నిమిషంలో కాంగ్రెస్ టిక్కెట్ దక్కకుండా చేశారు.

● అల్లు కేశవ వెంకట జోగినాయుడు:

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఎస్.కోట జనరల్ నియోజకవర్గం అయ్యింది. 2009 సార్వత్రిక ఎన్నికల్లో అల్లు కేశవ వెంకట జోగినాయుడుకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇచ్చింది. ఇది రఘురాజుకు నచ్చలేదు. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాట్లాడినా వినలేదు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోవడమే గాక జోగినాయుడు ఎన్నికగాకుండా దెబ్బతీశారు. ఫలితంగా టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి గట్టెక్కింది. ఫలితంగా నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రఘురాజుకే సీటు ఇచ్చింది. కానీ రెండోసారి కూడా ఓటమి తప్పలేదు.

● కుంభా రవిబాబు:

శెట్టి గంగాధరస్వామికి గాకుండా ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కుంభా రవిబాబుకు కాంగ్రెస్ అధిష్టానం 2004 ఎన్నికల్లో టికెట్ ఇచ్చింది. గెలిచిన ఏడాది వరకూ రవిబాబు, రఘురాజు మధ్య సంబంధాలు బాగానే ఉండేవి. తర్వాత రఘురాజు ఎప్పటిలాగే ఆధిపత్యధోరణి, అహంకారం ప్రదర్శించడం మొదలెట్టారు. రవిబాబు పదవీకాలమంతా రఘురాజు తిరుగుబాటును ఎదుర్కోవడానికే సరిపోయింది. 2009 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అసలు రవిబాబు పనితీరు బాగోలేదని ఫిర్యాదు చేయడానికి రెండు బస్సుల్లో అనుచరులను రఘురాజు తీసుకెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

కడుబండి శ్రీనివాసరావు:

రఘురాజు 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. కానీ వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఎస్.కోట టికెట్‌ను కడుబండి శ్రీనివాసరావుకు ఇచ్చింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనంలో కడుబండి శ్రీనివాసరావు టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారిపై ఘన విజయం సాధించారు. కానీ రఘురాజు తనకు ప్రాబల్యం ఉందని చెప్పుకుంటున్న నాలుగు గ్రామ పంచాయతీల్లో టీడీపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం. అయినప్పటికీ రఘురాజుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి చట్టసభలో కూర్చోబెట్టింది. ఎమ్మెల్యే కడుబండి కూడా నియోజకవర్గంలో ఎవ్వరికీ ఇవ్వనంత ప్రాధాన్యం అతనికి ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అతను చెప్పిన అభ్యర్థులకే పార్టీ నుంచి మద్దతు పలికారు. ఇలా ఎంత గౌరవం ఇచ్చినా మళ్లీ అతనిలో ఆధిపత్య ధోరణి బయటకు వచ్చింది. కడుబండిని మార్చేయాలంటూ ఏకంగా ఉద్యమమే ప్రారంభించారు. తీరా కడుబండి శ్రీనివాసరావుకే మళ్లీ టికెట్ ఖరారు చేయడంతో తెరచాటు యుద్ధానికి తెరలేపారు. భార్య సుబ్బలక్ష్మిని, కొంతమంది అనుచర గణాన్ని టీడీపీలోకి పంపించారు. ఈ ద్వంద్వ వైఖరిపై నియోజకవర్గం అంతా విమర్శలు వెల్లువెత్తడంతో రఘురాజు వర్గం దిద్దుబాటు చర్యలకు దిగింది. టీడీపీలో చేరిక వ్యవహారం రఘురాజుకు తెలియదని, ఆయనకు చెప్పకుండానే ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లామని చెప్పడం కొసమెరుపు.

పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన అవసరం

- కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లు దాఖలు చేసే విధానం, సువిధ యాప్‌లో దరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఈఆర్‌ఓలకు, నోడల్ అధికారులకు కలెక్టరేట్‌లో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో 1,172 ప్రదేశాల్లో 1,847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. వీటిలో 11 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా రూపొందించామన్నారు. రెండింటిని యువత, 7 కేంద్రాలను మహిళలు, మరో రెండు పోలింగ్ స్టేషన్లను దివ్యాంగులే పూర్తిగా నిర్వహిస్తారని, ఆయా వర్గాల్లో స్ఫూర్తిని నింపి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నదే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 15,41,001 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో 7,60,400 మంది పురుషులు, 7,80,518 మంది మహిళలు, 83 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారని చెప్పారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ పోల్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ రోజున చేసే ఏర్పాట్లు, పోస్టర్ బ్యాలెట్లు, హోమ్ ఓటింగ్, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, సువిధ, ఈజీఆర్‌ఎస్, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ ప్రక్రియకు 90 నిముషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. నామినేషన్ పత్రంలో అభ్యర్థులు తమ ఆస్తులు, తమపై నమోదై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాలని విజయనగరం ఆర్‌డీఓ ఎం.వి.సూర్యకళ చెప్పారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసే విధానం, నిబంధనలు, జత పరచాల్సిన పత్రాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి పూజకు.. సర్వం సిద్ధం

మహాశివరాత్రి పూజలకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. అభిషేక ప్రియుడిని మనసారా అర్చించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రామతీర్థం, పుణ్యగిరి, సంగాం తదితర పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పుణ్యతీర్థం.. రామతీర్థం

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్రలో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం... మూడు జిల్లాల భక్తుల అపార నమ్మకం రామక్షేత్రం. వైష్ణవ దేవాలయంగా ప్రసిద్ధికెక్కినా ఏటా జరుగుతున్న శివరాత్రి జాతరే రామక్షేత్ర ప్రత్యేకం. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా రామక్షేత్రానికి విచ్చేస్తారు. తొలిరోజు రాత్రంతా స్వామివారి క్షేత్రంలో దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో జాగరణ చేస్తారు. మరుసటి రోజు ఉదయం రామకోనేరు పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా శ్రీరాముడిని అనంతరం క్షేత్ర పాలకులైన ఉమాసదాశివ స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సుమారు లక్షకు పైగా భక్తులు రావచ్చని పోలీస్, దేవదాయ, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి 30 ఆర్టీసీ బస్సులు, విజయనగరం నుంచి 40 ఆర్టీసీ బస్సులు సాధారణ చార్జీలతో ప్రయాణికులకు సేవలు అందిస్తాయి.

- భక్తులకు రామతీర్థం ఆలయంలోకి ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం (రూ.50), ఉమాసదాశివ ఆలయంలోకి ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం (రూ.50) కల్పిస్తున్నారు. భక్తుల కోసం 30వేల లడ్డూ ప్యాకెట్లు, పులిహోర ప్రసాదాన్ని సిద్ధం చేశారు. శివాలయం, ప్రధాన ఆలయంతో పాటు బోడికొండ మెట్ల మార్గాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.



విద్యుత్ వెలుగులతో మెరిసిపోతున్న రామతీర్థం దేవస్థానం

- శివరాత్రి పర్వదినాన తమిళనాడు రాష్ట్రంలో అరుణాచలేశ్వరుల పర్వతంపై మూడు రోజుల పాటు ఏ విధంగా శిఖరజ్యోతిని వెలిగిస్తున్నారో.. రామతీర్థం బోడికొండపై కూడా గడిచిన నాలుగేళ్ల నుంచి శిఖర జ్యోతిని వెలిగిస్తున్నారు. ఏటా శిఖర జ్యోతి ప్రజ్వలన ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. శిఖర జ్యోతిని వెలిగించేందుకు అవసరమైన వనరులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తన సొంత నిధులతో సమకూర్చారు. గురువారం రాత్రి 7గంటల సమయంలో ప్రత్యేక పూజల నడుమ శిఖర జ్యోతిని ఆయన వెలిగిస్తారు. అనంతరం బోడికొండపై భారీ ఎత్తున బాణాసంచా కాల్చనున్నారు.



కల్యాణ వేదిక వద్ద లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్న భక్తులు

300 మందితో పోలీస్ బందోబస్తు

మహాశివరాత్రి జాతరలో ఎటువంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. అల్లర్లు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను నియమించాం. డీఎస్పీ స్థాయిలో ఇన్‌చార్జిగా నియమించి ఆరుగురు సీఐలతో జాతర సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొత్తం 300 మంది పోలీసులతో షిఫ్టుల వారీగా బందోబస్తును ఏర్పాటు చేశాం. నేడు సాయంత్రం నుంచే సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. రెండు రోజులూ సేవలతో కూడిన పహారా కొనసాగుతుంది.

– దీపికా పాటిల్, ఎస్పీ, విజయనగరం

భక్తులకు ఇబ్బందులు కలగకుండా...

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కూలైన్లలో ఉన్న చిన్నపిల్లలకు పాలు, భక్తులకు మంచినీరు సరఫరా చేస్తాం. ప్రసాదం కౌంటర్ వద్ద భక్తుల రద్దీ దష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశాం. జాతర విజయవంతానికి అన్ని శాఖల సహకారం కోరాం. భక్తులు కూడా సహకరించాలి.

– శ్రీనివాసరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం

భక్తసిరి.. 'పుణ్య'గిరి




పుణ్యగిరి ప్రధానాలయం

శృంగవరపుకోట: కొండపై నుంచి జాలువారే నీటి సవ్వడి, అల్లరిచేసే మర్కట మూకలు.. పురాణ గాథలతో ముడిపడిన సందర్శనీయ స్థలం పుణ్యగిరి. కొండల నడుమ ఉమాకోటిలింగేశ్వరుడు కొలువుదీరిన పుణ్యక్షేత్రం. ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన 'పుణ్యగిరి' ఈ నెల 8,9 తేదీల్లో జరగనున్న శివరాత్రి జాతరకు సిద్ధమౌతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

క్షేత్ర విశిష్టత ....

విరాటరాజు కొలువులో అజ్ఞాతవాసాన పాండవ మధ్యముడు అర్జునుడు శివుని కోసం తపమాచరించిన పవిత్ర స్థలం పుణ్యగిరి. విరాటరాజ్య రక్షకుడైన కీచకుడు తన శృంగార విహారాల కోట ఈ ప్రాంతాన ఉండడంతో ఈప్రాంతం శృంగవరపుకోటగా మారిందని చెబుతారు. సైరంధ్రి పేరుతో ఉన్న ద్రౌపదిని బలాత్కరించబోయి భీముని చేతిలో నిహతుడైన కీచకునికి ముక్తి ప్రసాదించమని ఆతని సోదరి సుదేష్ణ కోరిక మేరకు ధర్మరాజు శివుని ప్రార్థించగా, శివుడు తన శిరోపాయల నుంచి ఒక ధారను ప్రసరింపచేశాడు. ఈ ధార భూగర్భం నుంచి వస్తూ శివుని పాదాలను తాకి గోముఖం ద్వారా బయటకు వస్తోంది. దీన్ని పుట్టదార, శివధారగా పిలుస్తారు. కాశీ క్షేత్రం మాదిరిగా ఇక్కడ కొండ శిలకు అంటిపెట్టుకుని భూమికి అధోముఖంగా కోటి లింగాలు ఉన్నాయన్నది భక్తుల విశ్వాసం. కొండలో ఉన్న నీరు లింగాల నుంచి ధారలుగా పడుతుంది. దీన్ని కోటిలింగాల రేవుగా పిలుస్తారు.




పుణ్యగిరిలో పూజలందుకుంటున్న ఉమాకోటిలింగేశ్వరుడు

సంగమేశ్వర దర్శనం.. ముక్తికి మార్గం

వంగర: సర్వమత సమ్మేళనమే సంగమేశ్వరం. మండలంలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ద్వాపరయుగంలో బలరాముడు ఏక కాలంలో నగావళి నదీ తీరం వెంబడి పాయకపాడు, గుంప, సంగాం, శ్రీకాకుళం, కళ్లేపల్లి ప్రాంతాల వద్ద ఐదు శివలింగాలను ప్రతిష్ఠించాడు. వాటిలో ఒక శివలింగం సంగాంలో ప్రతిష్ఠించినట్టు పురాణగాథ. ఆలయం కుడ్యాలపై దేవతా మూర్తులు విగ్రహాలు, గోడలపై విష్ణుమూర్తి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఆలయ ప్రదేశంలో వేగావతి, నాగావళి, సువర్ణముఖి నదులు ఒకే చోట కలుస్తాయి. ఈ మూడు నదులు ఒకే చోట కలియడంతో ఈ ప్రాంతాన్ని త్రివేణి సంగమంగా భక్తులు పిలుస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ తరహాలో దీనిని త్రివేణి సంగమంగా పిలుస్తారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించేందుకు ఉత్తరాంధ్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఆలయ ప్రాంగణంలో నాలుగు వందల సంవత్సరాల నాటి భారీ మర్రి వృక్షం నీడన వంటావార్పు చేసి పితృదేవతలకు పిండ ప్రదానం చేపడితే వారి ఆత్మలకు శాంతి చేకూరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వారం రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ చైర్మన్ బోను నాగరాజు, ఈఓ పొన్నాడ శివకేశవరావు తెలిపారు.



వంగర: బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం



వంగర: సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయం.

ఆలయానికి ఇలా చేరుకోవాలి

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే భక్తులు రాజాం పట్టణానికి చేరుకోవాలి. అక్కడ నుంచి వంగర, కొప్పర, రుషింగి గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఉంటాయి. రాజాం నుంచి 21 కిలోమీటర్లు దూరంలో ఉన్న మగ్గూరు కూడలి వద్ద దిగాలి. అక్కడ నుంచి 3 కిలోమీటర్లు దూరంలో ఆలయం ఉంటుంది. అక్కడ నుంచి విరివిగా ఆటోలు ఉంటాయి.

క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: పాలిసెట్‌కు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వి లియం క్యారీ తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ – రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి రూపొందించిన 'పాలిటెక్నిక్ చదవటం ఉత్తమం, ఎందువలన అంటే' పోస్టర్‌ను ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత తరువాత సాంకేతిక విద్యను అభ్యసించడం సులువైన, తెలివైన మార్గం అన్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు గణనీయంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పాలిసెట్ ద్వారా అడ్మిట్ అయిన అర్హులైన అందరికి ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి సౌకర్యాలు, ఉపకార వేతనాలు సదుపాయం ఉంటుందన్నారు. ఏపీసీటీఈ మార్గదర్శకంతో ఆధునిక టెక్నాలజీలకు అనుగుణంగా ఇండస్ట్రీ 4.0 కోర్సుల రూపకల్పన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట ఉజ్వల్, ఈసీఈ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనురాధ, మండల ఉపాధ్యక్షులు బి.రవికుమార్, సర్పంచ్ వి.త్రినాథ రావు, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జె.కె.గుమ్మడలో జీడి, మామిడి తోటలు దగ్ధం



జీడి, మామిడి తోటలో చెలరేగిన మంటలు

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట పంచాయతీ జె.కె.గుమ్మడలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామ సమీపంలోని దాలినాయుడు తోట వద్ద 12 మంది రైతులకు చెందిన 10 ఎకరాల జీడి, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో జక్కు గణపతి, అల్లారపు తిరుపతి, డొంకాడ రమణమ్మ, కొల్లి శివున్నాయుడు, మరిశర్ల సత్యంనాయుడుతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన తోటలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి ఈ ఘటనకు పాల్పడ్డారని రైతులు చెబుతున్నారు. దీనిపై వంగర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు. గ్రామస్తులందరూ సమష్టిగా మంటలను అదుపు చేశారు.

జూదరుల నుంచి రూ.1.78లక్షల నగదు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని మన్నిపాలెం గ్రామం సమీపంలో గల దారపైడితల్లిమ్మ వారి గుడి సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్‌లు బుధవారం సాయంత్రం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 18 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,78,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

బొబ్బిలి: భార్యపై అనుమానంతో ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా తలపై భర్త మోదడంతో ఆస్పత్రిలో చేరి అనంతరం మరణించింది. సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని కమ్మవలసకు చెందిన పాలినవలస తవిటినాయుడు, లక్ష్మిలకు జ్యోతిప్రసాద్(15), యశ్వంత్(12) పిల్లలున్నారు. తరచూ భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడినట్టుగానే గత నెల 20న కూడా గొడవ జరగడంతో భార్య తలపై భర్త ఇనుప రాడ్‌తో కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన లక్ష్మి మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని క్షతగాత్రుడు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట – సీతానగరం గ్రామాల మధ్య బుధవారం రాత్రి గుర్తు (45) తెలియని వ్యక్తి గాయాల పాలైన వైనమిది. 108 సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పాత రైల్వే గేట్ సమీపంలో గాయాల పాలైన వ్యక్తి ఉన్నట్లు సెల్ ఫోన్ల ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సమయానికే రైలు పట్టాలపై ఎడమ కాలు విరిగి మతితప్పి ఓ వ్యక్తి ఉన్నట్టు గుర్తించారు. దీంతో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్చినట్లు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

చదువుల లోగిళ్లు... గిరిజన సంక్షేమ ఆశ్రమాలు



సుందరంగా హద్దుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

- కార్పొరేట్‌ను తలదన్నేలా చదువులు
- ఆధునికీకరించిన వసతులు
- నాడు – నేడు తొలి విడతలో 47 ఆశ్రమాలకు రూ.21 కోట్లు
- రెండో విడతలో 37 ప్రాథమిక పాఠశాలలకు రూ.34 కోట్లతో వసతులు
- పెరిగిన ప్రవేశాలు



క్రమశిక్షణతో భోజనాలు చేస్తున్న బాలికలు

సీతంపేట: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన సంక్షేమ విద్యకు పెద్దపీట వేస్తుంది. బైజూస్ కంటెంట్‌తో చదువులు ముందుకు సాగుతున్నాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుంది. మనబడి నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఆట, పాటలకు అనువుగా ఉండేలా ఆట స్థలాలు, పరికరాలు ఉండడం, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్లు నిర్మాణం, మినరల్ మంచినీటి సదుపాయాలు, ఆకట్టుకునే తరగతి గదులు వాటిలో ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరడానికి ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులతో కొండపోడు వ్యవసాయాలకు తోడు వెళ్తే పిల్లలు ఇప్పుడు బడిబాట పట్టారు. ఉల్లాసంగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువుతున్నారు. మూడు పూటల భోజన, వసతి, వైద్య సౌకర్యాలు వంటివి పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఈ ఏడాది ప్రవేశాలకు



సీతంపేట బాలికల ఆశ్రమపాఠశాల

మంచి డిమాండ్ ఏర్పడింది. సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో 16,775 మంది విద్యార్థులు చదివితే 2023 – 24లో 20,,265 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 3,490 మంది విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయి. తొలి విడతలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. రెండో విడతలో రూ.34 కోట్లతో 37 గిరిజన ప్రాథమిక పాఠశాలలు, మరో 5 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు మౌలిక



బై జూస్ ట్యాబ్‌ను వినియోగించుకుంటూ చదువుతున్న బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

వసతులు కల్పించారు. మరుగుదొడ్లు నిర్మాణంతో పాటు ప్రతీ తరగతి గదిలో విద్యుత్ సౌకర్యంతో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు, తాగునీటి కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, పాఠశాల భవనం, ప్రహరీలకు నాణ్యమైన పెయింటింగ్, పాఠశాలలో ప్రస్తుతం ఉన్న భవనానికి పూర్తి స్థాయి మరమ్మతులు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు అదనపు గదుల నిర్మాణం వంటివి చేపట్టారు. దీంతో ఈ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి.

గిరిజన విద్యకు పెద్దపీట



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం మరమ్మతులు పేరుతో రంగులు వేసి నిధులు కొల్లగొట్టారు. జగనన్న ప్రభుత్వంలో గిరిజన విద్యకు పెద్దపీట వేశారు. అన్ని పాఠశాలలకు పూర్తి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు



అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు నియమించాం. ఖాళీలున్నచోట సీఆర్‌టీలను నియమించాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మంచి చదువులను అందించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ

ప్రవేశాలు పెరిగాయి



గతంతో పోలిస్తే పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. మా పిల్లలకు సీట్లు ఇప్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ విద్యార్థికి ఆయా పాఠశాలల్లో ఖాళీలను అనుసరించి సీట్లు కేటాయిస్తున్నాం.

– ఎ.లిల్లీరాణి, డిప్యూటీ ఈఓ, సీతంపేట

జగన్ మామకు రుణపడి ఉంటాం



జగన్ మామకు రుణపడి ఉంటాం. పాఠశాలల్లో మాకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇక్కడ ఉండి చక్కగా చదువుకుంటున్నాం. బై జూస్ పాఠాలు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. రోజూ ట్యాబ్‌లు వినియోగించుకుంటున్నాం. ప్రత్యేక సెలవుల్లో తప్ప ఎప్పుడు ఇంటికి వెళ్లకుండా పాఠశాలల్లో ఉండి చదువు కొనసాగిస్తున్నాం.

– ఎస్.ఝాన్సీరాణి, 9వ తరగతి

హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలి

- రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలని... తద్వారా వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి కోరారు. స్థానిక ఎస్‌వీఎన్ లేక్ పేలస్ హోటల్‌లో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్య నిర్వాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న హోటల్స్ రంగం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ 12 శాతం ఉందని దాని భారం వినియోగదారుల మీద పడుతుందని... దానిని 5 శాతం వరకు తగ్గిస్తే... వ్యాపారులకు, వినియోగదారులకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఈ విధానం అమలు అవుతుందని, దీని వల్ల రూ.20లక్షల కోట్లు రాయితీలు వస్తాయని తెలియజేశారు. తద్వారా చిన్న వ్యాపారులు కూడా అభివృద్ధి చెందుతారని వివరించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా అవకాశం వస్తుందని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ శెనాయ్, జాయింట్ సెక్రటరీ గుడిశా శివకుమార్, పూర్ణచందర్

రివర్స్ టెండరింగ్‌తోనే ప్రజాధనం ఆదా

- టిడ్కో ఇళ్లకు రూ.3.71 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్
- ఎమ్మెల్యే శంబంగి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన

బొబ్బిలి: టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు వారి అనుయాయులకు కట్టబెట్టిన భారీ కాంట్రాక్టులను వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ వేయడంతో భారీ ఎత్తున ప్రజాధనం ఆదా అయిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. రామన్నదొరవలసలో టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.71 కోట్లతో ఏర్పాటు చేసిన ఈపీడీసీఎల్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఛార్జ్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బొబ్బిలిలో చివరి దశకు వచ్చిన 1680 ఇళ్లను పూర్తి సౌకర్యాలు కల్పించి త్వరలోనే అప్పగిస్తామన్నారు. టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 89 ప్రాజెక్టులలో ఇప్పటికే 1.25లక్షల ఇళ్లను అప్పగించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద రూ.451 కోట్లతో రెండు దఫాలుగా నిధులు వెచ్చించి సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలోని గుమడాం, సోనియానగర్, సాలూరు, బొబ్బిలి, సారిపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో సాగుతున్నాయన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ ఎ.అనంతరావు, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ పి.త్రినాధరావు, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ బి.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చెలికాని మురళీ కృష్ణ, ఏఎంసీ వైస్ ఛైర్మన్ తెంటు పార్వతి పాల్గొన్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బలపడాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయచంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

పార్వతీపురం: ఇండియన్ మెడికల్ అసోషియేషన్‌ను బలపరచాల్సిన అవసరం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయచంద్ర నాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డాక్టర్లు, ప్రభుత్వ డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. డాక్టర్లు సమస్యలను రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఎంఎల్‌సీ ఎలా కేటాయించారో, వైద్యులకు కూడా ఒక ఎంఎల్‌సీ కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆస్పత్రులను నిర్వహించాలంటే లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు చేయాలని, ఈ లైసెన్సులన్నీ ఒకే సింగిల్ విండో విధానంలో అమలు చేస్తే ఎంతో వ్యయభారం, సమయభావం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డా. యాళ్ళ వివేక్, వై.పద్మజ, డా.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి బాలుడి మృతి

అనంతగిరి(అల్లూరి జిల్లా): మండలంలోని లంగుపర్తి గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల సమీపంలోని బుధవారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఎస్.కోట ప్రాంతానికి చెందిన బాలుడు మృతి చెందాడు. లంగుపర్తిలో మహాశివ రాత్రి జాతర సందర్భంగా ఎస్.కోట ప్రాంతానికి చెందిన సౌండ్ సిస్టం, స్టేజ్‌ను బొలెరో వాహనంలో తీసుకువచ్చారు. పాఠశాల సమీపంలోని వాహనం అదుపుతప్పి వెనుకకు జారడంతో బోల్తా పడింది. వాహనంలో ఉన్న ఎస్.కోట ప్రాంతానికి చెందిన పవన్‌కల్యాణ్(15) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని పట్టణాల్లో రైతు బజార్‌లు ఏర్పాటు

- మార్కెటింగ్ శాఖ జేడీ సుధాకర్

బొబ్బిలి: ఉత్తరాంధ్రలోని అన్ని పట్టణాల్లోనూ రైతు బజార్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ జేడీ పి.సుధాకర్ అన్నారు. బొబ్బిలి ఏఎంసీని బుధవారం సందర్శించిన ఆయన ఇక్కడి నుంచే రాష్ట్ర స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తన పరిధిలో 61 కమిటీలున్నాయన్నారు. ఈ కమిటీల నుంచి రూ.163 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.109 కోట్లను వసూలు చేసినట్టు చెప్పారు. లక్ష్యాన్ని మార్చి నెలాఖరుకు చేరుకుంటామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు రైతు బజార్ల కోసం స్థలాలు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వ్యాపార వాణిజ్య వర్గాలకు ఈ ఫార్మింగ్‌పై చైతన్యం కల్పిస్తామని చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఏడీ బి.రవికిరణ్, కార్యదర్శి కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించేలా శిక్షణ

- శాస్త్ర పరిజ్ఞాన విస్తరణ సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలి
- గిరిజన యూనివర్సిటీలో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషి



విజేతలైన విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: శాస్త్ర పరిశోధన పరిజ్ఞాన విస్తరణలో సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలని ఆ దిశగా శిక్షణలు అందించాలని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీజోషి అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'విక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో సాంప్రదాయ విజ్ఞానంపై ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు శిక్షణ పొందాలని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థ దేశ వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. ఈ అంశంపై డాక్యుమెంటరీ చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. అందుకు అవసరమైన నిపుణులతో ఐకేఎస్‌పై చర్చా ధారావాహికంగా ప్రారంభిస్తుందని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీదేవి మార్గదర్శకత్వంలో బయోటెక్నాలజీ విద్యార్థులు రూపొందించిన పూల గైడ్‌ను ఆవిష్కరించారు. సైన్స్ డేని పురస్కరించుకొని ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను ముఖ్యఅతిథి అందజేశారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోకరా..

- గల్ఫ్ దేశాలకు పంపిస్తామని...
- ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేలకు పైగా వసూలు
- దందా అంతా ఆన్‌లైన్ ద్వారానే..
- రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు, కలెక్టరేట్‌లో అధికారులకు వినతి



కలెక్టరేట్ వద్ద తమకు వచ్చిన ఆఫర్ లెటర్స్‌ను చూపిస్తున్న నిరుద్యోగులు

విజయనగరం క్రైమ్: గల్ఫ్ దేశాలకు పంపిస్తామని వాట్సాప్‌లలో వచ్చిన మెసెజ్‌లకు, కరపత్రాలకు స్పందించిన కొంతమంది జిల్లాకు చెందిన నిరుద్యోగులతో పాటూ అధిక సంఖ్యలో ఒడిశాకు చెందిన వారు మోసపోయారు. దీనికి సంబంధించి బుధవారం రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ముడిదాం సమీపంలో ఉన్న హోండా షోరూమ్ సమీపంలో స్మశానానికి ఆనుకుని ఒక పాతబడిన ఇల్లుఉంది. ఇంటి ఓనర్ ఓఎల్ఎక్స్‌లో అద్దెకు ఇస్తామని ప్రకటన ఇస్తే, దాని ప్రకారం ఆ యజమానికి ఫోన్ చేసి, ఆ ఇంటిని గుర్తు తెలియని వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. ఆన్‌లైన్ ద్వారానే ఇంటి అద్దె పేమెంట్ చేశాడు. అయితే లైఫ్ లైన్ ట్రావెల్ ఏజెన్సీ పేరుతో వాట్సాప్ ద్వారా గల్ఫ్‌లో పలు ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు ప్రకటించాడు. నిరుద్యోగులు ఆ కరపత్రాలను చూసి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అనంతరం వారంతా వారి ఊళ్లకు వెళ్లిన తర్వాత వారికి చాటింగ్ ద్వారా ఆఫర్ లెటర్లు పంపించి, విమాన చార్జీలు తదితర వాటితో పాటూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేల వరకూ వసూలు చేశాడు. ఆ తర్వాత రోజులు గడుస్తున్నప్పటికీ ఎటువంటి సమాచారం లేకపోవడంతో బాధితులు ఇంటర్వ్యూ జరిగిన ఇంటికి చేరుకున్నారు. అక్కడ తాళాలు వేసి ఉండడంతో తాము మోసపోయామన్న సంగతి వారికి అర్థమైంది. వెంటనే రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్నత అధికారులకు తమ పరిస్థితిని వివరించారు. సుమారు తొమ్మిది మంది జిల్లా కేంద్రం నుంచి ఫిర్యాదు చేశారు. రూ.5 లక్షలకు పైగా మోసపోయామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఒడిశాకు చెందిన నిరుద్యోగులు 50 మందికి పైగా ఉండవచ్చని చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ తెలిపారు.

మెటలర్జికల్ విద్యతో ఉద్యోగావకాశాలు అధికం

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య
- జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ విద్యలో మెటలర్జికల్ కోర్సులతో అధిక ఆదాయంతో కూడిన ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మెటలర్జికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం 'ఐసెన్2కే24' సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిశోధనా పరిజ్ఞానాన్ని పెంచుకుంటే మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యతో ఉపాధి, ఉద్యోగాలు సులువుగా పొందవచ్చన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఓ హైదరాబాద్ సైంటిస్ట్–జీ డాక్టర్ ఎస్.కిషోర్‌నాథ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యతో పాటు ఆయా కోర్ సబ్జెక్ట్‌లపై నైపుణ్యాలను కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న టాటా స్టీల్ లిమిటెడ్ ప్రొడక్ట్ టెక్నాలజీ గ్రూప్ జోనల్ హెడ్ డాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులకు విద్యార్థులు హాజరయి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అనంతరం మెటలర్జికల్ విభాగం రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి వి.మణికుమార్, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, బీఆర్ అంబేద్కర్, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లుగా ఎ.పవన్‌మాధవ్, కె.ముఖేష్, ఆర్.పూర్ణిమ వ్యవహరించారు.